మేఘాల కొండ కనువిందు

పర్యాటక ప్రాంతమైన వంజంగి (హిల్స్) మేఘాల కొండకు శుక్ర వారం పర్యాటకుల తాకిడి నెలకొం ది. దసరా సెలవులు కావడంతో భారీగా సందర్శకులు తరలివ చ్చారు. ప్రకృతి అందాలను తిల కిస్తూ మంత్రముగ్ధులయ్యారు.

– సాక్షి, పాడేరు



అమ్మవారికి వెండి కుందె..



మోతుగూడెం: మోతుగూడెం, పొల్లూరు గ్రామ దేవత ధారాలమ్మ అమ్మ వారికి పొల్లూరు గ్రామస్తులు రూ. 60 వేలు విలువైన వెండి కుందెను శుక్రవారం సమ ర్పించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి అర్చకునికి అందజేశారు.



నిమ్మ మొక్కలను పంపిణీ చేస్తున్న ఉపాధి హామీ,ఉద్యానవన శాఖ అధికారులు

వన వికాసం

పచ్చని కొండల్లో విస్తరించే వనాల ఉత్పత్తులే గిరిజనుల జీవనానికి ప్రధాన వనరులు. వారి ఆర్థికాభివృద్ధికి సోపానాలు. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. శాశ్వత ఆదాయం వచ్చేలా తోటల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తూ శ్రీకారం చుట్టింది. మొక్కల పంపిణీ చేపట్టింది.

జిల్లా వివరాలు	
మండలాలు	22
రైతులు	3347 మంది
ఎకరాలు	3,500
మొక్కలు	3,16,294

- గిరి గ్రామాల్లో విస్తరణకు శ్రీకారం
- పాడేరు ఐటీడీఏ పరిధిలో మొక్కల పంపిణీ
- వీటి సంరక్షణకు ఉపాధి నిధుల చెల్లింపు
- రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పెంపకం

ముంచంగిపుట్టు: గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. వారికి శాశ్వత ప్రయోజనం సమకూరేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలోని 11 మండలాల గిరిజన రైతులకు ఉచితంగా జీడి, నిమ్మ, జామ, నేరేడు, దానిమ్మ, కొబ్బరి మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేసిం ది. వీటి పెంపకానికి సంబంధించి వారిపై ఎటువంటి ఆర్థికభారం లేకుండా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుం టోంది. ఇందుకుగాను మూడేళ్ల పాటు ఉపాధి హామీ నిధు లను వారి ఖాతాల్లోనే జమచేస్తోంది. ఒకపక్క వనాల విస్త రణతో పాటు మరోపక్క ఉపాధి లభిస్తుండటంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాడేరు ఐటీడీఏ పరిధిలో..

ముంచంగిపుట్టులో 114 మంది రైతులకు 7550 మొక్కలు అందించారు. అనంతగిరిలో 134 మందికి 11,200, అర కులో 131 మందికి 18,085, డుంబ్రిగుడలో 276 మందికి 30, 380, హుకుంపేటలో 243 మందికి 27, 024 మొక్కలు పంపిణీ చేశారు. జి.మాడుగులలో 242 మందికి 25,170, పాడేరులో 160 మందికి 16, 250, పెదబ యలులో 81 మందికి 6,020, చింతపల్లిలో 138 మందికి 51,040, కొయ్యూరులో 274 మందికి 19,770, జీకేవీ ధిలో 298 మందికి 27 వేల వివిధ రకాల మొక్కలను అం దజేశారు.

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో..

దేవిపట్నం మండలంలో172 మంది రైతులకు 12040 మొక్కలను అందించారు .మారేడుమిల్లిలో 346 మందికి 29, 360, రంపచోడవరంలో 269 మందికి 18,760, వై.రామవరం అప్పర్‌లో 83 మందికి 5,810,అడ్డతీగలలో 93 మందికి 6790, గంగవరంలో 113 మందికి 7910, వై.రామవరం లోయర్‌లో 175 మందికి 12,215, రాజవొ మ్మంగిలో 78 మందికి 200 మొక్కలు అం దజేశారు.

మొక్కల పంపిణీ వివరాలు: రెండు ఐటీడీఏ పరిధిలో 22 మండలాల్లో 3,447 మంది రైతులకు నిమ్మ 69,795, జీడి 1,37,270, నారింజ 56,100,జామ 4,510, నేరేడు 520, దానిమ్మ 9,879, కొబ్బరి 5,220,డ్రాగన్ ఫ్రూట్ 24,750, చింత 2,440, రేగు 960, మామిడి 3990, జంబోనిమ్మ 440లు పంపిణీ చేశారు.

మొక్కల సంరక్షణతో ఉపాధి

మొక్కల సంరక్షణకు మూడేళ్ల పాటు ప్రభుత్వం నిధులు చెల్లిస్తుంది. దీనివల్ల రైతుకు పరోక్షంగా ఉపాధి కలుగుతుంది. ఎకరా విస్తీర్ణంలో గుంతలు తీసేందుకు, మొక్కలు చుట్టూ కంచె, సస్యరక్షణ, ఎరు వులు, నీటి సదుపాయం నిమిత్తం రైతుల ఖాతాలకే జమచేస్తుందని ఐటీడీఏ అధికా రవర్గాలు తెలిపాయి. మన్యం ప్రాంతంలో మొక్కలు పెంచేందుకు అనుకూలం కావడంతో గిరిజన రైతులకు ఏటా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మొక్కల పెంపకానికి గిరిజను లకు ప్రోత్సహించడంతో ఆర్థిక ప్రయో జనాలు చేకూరుతాయని తెలిపింది.



మొక్క నాటుతున్న గిరి రైతు

ప్రభుత్వ ప్రోత్సాహంతో మేలు



మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల ఎంతో మేలు చేకూరుతుంది. వాటి సంరక్షణకు ఆర్థిక సాయం అందించడం సం తోషంగా ఉంది. పెట్టుబడి లేకుండా శాశ్వత జీవనోపాధి కలుగుతుంది. గతంలో అప్పులు చేసి మొక్కలు నాటేవాళ్లం. సంరక్ష ణకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ కష్టాలు తొలగిపోయాయి. మొక్కలు పెద్దవై దిగుబడి వస్తే ఆదాయ వనరులు మెరుగుపడతాయి.

– వంతాల రాజేశ్వరరావు, సుజనపేట,ముంచంగిపుట్టు

మూడేళ్లపాటు రైతులకు తోడ్పాటు



గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. రైతులకు కావలసిన మొక్కలను అందిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మొక్కలు పెద్దవై ఫలసాయం అందించే వరకు రైతులకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుంది. మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే చూసుకుం టుంది.

– వి.రంగారావు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి

రేపు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

పాడేరు రూరల్ : ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పాడేరు డివిజన్‌లోని అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని డీఎ ల్పీవో కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలను శుభ్రపరిచి, రంగులతో తీర్చిది ద్దాలని ఆయన పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారు లకు సూచించారు. గాంధీ జయంతి నాడు మద్యం,మాంసం దుకాణాలు తెరవకుండా గట్టి చర్యలు చేపట్టాలని, నిబంధ నలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతగా సమస్యల పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఐటీడీఏ స్పందనలో 67 అర్జీలు స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్

సాక్షి,పాడేరు : అధికారులంతా స్పందన సమస్యల పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ సుమి త్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమా వేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌క లెక్టర్ వి.అభిషేక్, డీఆర్వో బి.దయానిధితో కలిసి 67 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా వ్యవహరిం చకపోతే సమస్యలు పరిష్కారం కావన్నారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, సంక్షేమశాఖల పరిధిలోని కోర్టు కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్వేయర్లతో సమావేశాలు నిర్వహించి సమ స్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు, ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగో పాల్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, డీఈవో పి.రమేష్‌బాబు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వినతులు వివరాలిలా..

- ఐటీడీఏలోనిర్వహించిన స్పందనలో 67 వినతులు స్వీకరించారు.
- జీకేవీధి మండలం జర్రెల పంచాయతీ రహదారి అట వీశాఖ అనుమతులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిం దని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ లోవ లక్ష్మి కోరింది.
- జీకేవీధి మండలంలోని నూతులు గ్రామానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బుజ్జిబాబు, కె.మోహన్‌రావు వినతి పత్రం అందజేశారు.
- జర్రెల కాలనీ, తోటలగొంది గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం పూర్తికి చర్యలు తీసుకో వాలని మొండిగెడ్డ సర్పంచ్ అడపా ప్రియాంక కోరారు.
- కొయ్యూరు మండలం గదబపాలెం పంచాయతీ పరి ధిలోని డ్రైనేజీలు, పంట చెరువులు, మంచినీటి సమ స్యలు పరిష్కరించాలని సర్పంచ్ ఉల్లి నర్సమ్మ వినతి పత్రంలో పేర్కొన్నారు.
- తనకు రావాల్సిన 2019, 2020కు సంబంధించిన జీతాలు విడుదల చేయాలని జి.మాడుగుల మండలం సింగర్భ పంచాయతీ మొండికోట ఆశా కార్యకర్త కోరిం ది.
- ఆశ కార్యకర్త ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని పెదలోచలి పంచాయతీ పనసలపాడు గ్రామస్తురాలు కొర్రా బుల్లమ్మ వినతిపత్రం అందజేసింది.

వాగులో చిక్కుకున్న రైతు సురక్షితం

- కొట్టుకుపోయిన బైక్
- రైతుల సాయంతో ఒడ్డుకు..



వాగులోంచి బైక్‌ను బయటకు తీస్తున్న రైతులు

రాజవొమ్మంగి: బైక్‌పై వెళ్తూ వాగులో చిక్కుకున్న రైతు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డాడు. మండలం లోని లబ్బర్తి గ్రామానికి చెందిన జీరెడ్డి సత్తిబాబు మోటార్ సైకిల్‌పై పెద్దేరు వాగుకు అవతలఉన్న పొలా లకు వెళ్లాడు. గురువారం చీకటిపడిన తరువాత తిరిగి బయలుదేరాడు. వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఉధృతి పెరగడంతో ప్రవాహంలో చిక్కుకున్నాడు. దీం తో బైక్‌ను అక్కడే వదిలి ఈదుకుంటూ ఒడ్డుకు చేరు కున్నాడు. బైక్ ప్రవాహంలో కొట్టుకుపోయింది. శుక్రవారం రైతుల సాయంతో అతికష్టంమీద దానిని బయటకు తీశారు.

మోదమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

- సాయంత్రం వరకూ రద్దీ
- దర్శించుకున్న అరకు ఎంపీ మాధవి, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్



సబ్ కలెక్టర్ అభిషేక్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అరకు ఎంపీ మాధవి

సాక్షి,పాడేరు : పాడేరు మోదకొండమ్మ అమ్మ వారిని దర్శించుకునేందుకు మైదాన ప్రాం తాల నుంచి భారీగా భక్తులు, భవానీ మాల ధారులు తరలివచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలు, శుక్రవారం కావడంతో సాయం త్రం వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సిం హాచలం నాయుడు, ఇతర ప్రతినిధులు ఉప్పల వెంకట రత్నం, కొట్టగుళ్లి రామారావు ఘన స్వాగతం పలికారు. పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్ కూడా అదే సమయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఎంపీ, సబ్‌కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అంద జేశారు.



ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

నేడు నోటిఫికేషన్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మొదలైంది. శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల నమోదుకు శనివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల సన్నాహకంగా ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ మద్దతు అభ్యర్థులను ఖరారు చేశాయి. కానీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ మాత్రం ఎవర్ని నిలబెట్టాలనే విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. అసలు పోటీలో ఉండాలా.. లేదా.. ఎవరికైనా మద్దతునివ్వాలా అనే దానిపై ఎటూ తేల్చుకోలేకపోతోంది. పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం 2023 మార్చి నెలతో ముగియనుంది. ఈలోపు ఎమ్మెల్సీ ఎన్నికను నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని తహసీల్దార్లు, ఆర్డీవోలు, జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో ఓటరు నమోదు దరఖాస్తులు శనివారం నుంచి స్వీకరించనున్నారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్వోలు వ్యవహరించనున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి 30 శాతం ఓటర్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాజకీయపక్షాలు ముందుగానే ఎన్నికలపై దృష్టి సారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ సీతంరాజు సుధాకర్‌కు మద్దతు ప్రకటించింది.

ప్రక్రియ ఇలా..

పట్టభద్రుల నుంచి దరఖాస్తుల స్వీకరణ : అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకు
ఓటరు జాబితా ముసాయిదా విడుదల : నవంబర్ 23
అభ్యంతరాల స్వీకరణ : నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు
తుది జాబితా విడుదల : డిసెంబర్ 30 **అర్హతలు :** 2019 అక్టోబరు నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. 10వ తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ రెగ్యులర్ విద్యా విధానంలో పూర్తి చేసినవారై ఉండాలి. **అనర్హులెవరు :** పదో తరగతి తర్వాత దూర విద్య ద్వారా డిగ్రీ చదివిన వారు, 10వ తరగతి ఉత్తీర్ణులైన తర్వాత మూడేళ్ల డిప్లొమా కోర్సు చేసిన వారు అనర్హులు **ఓటరు నమోదుకు కావల్సినవి :** ఓటరు నమోదు దరఖాస్తు, డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు జిరాక్సులు, వీటిపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలి. దరఖాస్తుపై పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటో అతికించాలి.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

రాజవొమ్మంగి: ప్రతి పంచాయతీలో ఉపాధి పనులకు సంబంధించి అక్టోబర్ రెండవ తేదీన గ్రామసభలు నిర్వహించి ప్రాధాన్యతాపనులను గుర్తించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్‌రామన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. గుర్తించిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజలనుంచి అభ్యంతరాలు ఉంటే నవంబర్ 13వ తేదీలోగా పరిష్కరించాలని సూచించారు. గ్రామసభల్లో గుర్తించిన పనులకు మండల పరిషత్ తీర్మానం, డిసెంబర్ 15లోగా జిల్లా పరిషత్ (కాకినాడ) ఆమోదం పొందాల్సిన అవసరం ఉంటుందన్నారు. కలెక్టర్ ఆమోదంతో ఏప్రిల్ ఒకట తేదీ నాటికి అవసరమైన లేబర్ బడ్జెట్ రూపకల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో 2,19,180 జాబ్‌కార్డులకు గాను సుమారు 4.25 లక్షల మంది వేతన దారులు ఉన్నారన్నారు. ఈ ఏడాదికి 84 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 75.13లక్షల పనిదినాలు పూర్తయినట్లు తెలిపారు. వచ్చే ఆర్థికసంవత్సరంలో 1.20 కోట్ల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలోని కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి, పెదబయలు, జీ మాడుగుల తదితర మండలాల్లో గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఉపాధి హామీ నిధులతో అల్లం, ఉద్యానవనాల సాగును ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. డీబీటీ మేనేజర్ వీ. రాజా నరేష్, స్థానిక ఎంపీడీవో బాపన్నదొర, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న డ్వామా పీడీ రమేష్‌రాజన్

62 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్టు, ద్విచక్రవాహనాలు, నగదు స్వాధీనం

కొయ్యూరు : అంతాడ ఘాట్ రోడ్డులో కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు ఆధ్వర్యంలో పోలీసులు మాటు వేసి గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద రూ.లక్షా 24 వేల విలువ చేసే 62 కిలోల గంజాయి లభించింది. దొరికిన వారు కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన బీమవరపు కృష్ణ, కాళ్లశ్రీనుగా గుర్తించారు. వారు గంజాయిని గూడెం కొత్తవీధి మండలంలో మారుమూల గ్రామంలో కొనుగోలు చేసి దానిని రౌతులపూడికి తరలిస్తున్నారని ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్, రూ.2500 స్వాధీనం చేసుకున్నామన్నారు.



పట్టుబడిన గంజాయి నిందితులు



జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో పోటీలకు ఒమ్మవరం ఉపాధ్యాయిని

రావికమతం: ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఒమ్మవరం స్కూల్ ఉపాధ్యాయిని కె.నాగజ్యోతి ఎంపికయ్యారు. ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో మంచి ప్రతిభ కనబర్చింది. దీంతో ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(శాప్) ఆధ్వర్యంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్-2022-23 సంవత్సరానికి గానూ జాతీయ స్థాయి పోటీలను త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్నారు. అక్కడా సత్తా చాటి విజయంతో తిరిగి రావాలని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం

మారేడుమిల్లి : సీఐటీయూ మండల నూతన కమిటీ ఎన్నిక జిల్లా నాయకురాలువాణిశ్రీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రత్నకుమారి, దాసులు ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడి గా జగన్, సహాయ కార్యదర్శిగా కిషోర్, ట్రెజరర్‌గా సిరిమల్లి రెడ్డి, 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

- త్వరితగతిన పూర్తి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు : గిరిజన ప్రాంతాల్లోని నాడు-నేడు రెండవ దశ పాఠశాలలు, జూనియర్ కళాశాలల భవనాల అభివృద్ధి పనులన్నింటిని వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ జూనియర్‌కళాశాల, గుడివాడ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు, ఆధునీకరణ పనులకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందన్నారు. రూ.15 లక్షల రివాల్వింగ్ ఫండ్ విడుదల చేసిందన్నారు.ఈ నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. టార్పాలిన్లు కొనుగోలు చేసి సిమెంట్‌ను భద్రపరచాలని, ప్రిన్సిపాల్ స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గుడివాడ ప్రాథమిక పాఠశాలలో పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లగిశపల్లి సచివాలయం సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ పసుపు ధరపై మాట్లాడారు.

ఓటరు అంగీకారంతోనే ఆధార్ అనుసంధానం

ఓటరు అంగీకారంతోనే ఓటరు జాబితాకు ఆయా ఓటర్ల ఆధార్ నంబర్లను అనుసంధానం చేయాలని కలెక్టర్ రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. స్థానిక జూనియర్ కళాశాలలోని 274, గుడివాడ ఎంపీపీ పాఠశాలలో 270, లగిశపల్లి ప్రైమరీ పాఠశాలలో 282 పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఫారం 6బీలను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఓటర్లకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు అంగీకారంతోనే ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోను రెవెన్యూ యంత్రాంగం విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వి.త్రినాథ నాయుడు, విద్యాశాఖ సహాయ సంచాలకులు వి.ఉదయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె.ప్రసన్న కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



గుడివాడ పాఠశాలలో అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్





అంతరరాష్ట్ర రహదారి నిర్మాణానికి వినతి

గూడెంకొత్తవీధి : మండలంలోని అంతరరాష్ట్ర రహదారి నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే దావీద్ విన్నవించారు. శుక్రవారం ఆయన నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్‌వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఈ రహదారి మరమ్మతులకు 2018లో రూ.84 కోట్లు మంజూరైనా పనులు చేపట్టలేదన్నారు. ఒడిశా, తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రహదారి ప్రధాన ఆధారమన్నారు. రహదారి శిథిలమవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. గూడెంకొత్తవీధి నుంచి నుంచి వై.రామవరం మీదుగా రంపచోడవరం వెళ్లే రహదారి నిర్మాణం కూడా చేపట్టాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.



మంత్రి దాడిశెట్టి రాజాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, దావీద్



స్వయం సమృద్ధి సాధించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరి మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులు పాటు జరిగిన చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీవో మాట్లాడుతూ మూడు రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు ఆర్థికసాయం అందిస్తామన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కేవీకే కోఆర్డినేటర్ డా. లలితకామేశ్వరి, మత్స్యవిభాగం శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు, కేవీకే శాస్త్రవేత్తలు క్రాంతి, క్రాంతికుమార్, చిరంజీవి, రాజశేఖర్, ఆదర్శ పాల్గొన్నారు.



మత్స్య ఆధారిత ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీవో గనోరే

స్టాల్ ఏర్పాటుకు చర్యలు

గిరిజన ఉప ప్రణాళిక నిధులతో మహిళలకు మూడు రోజులు పాటు రొయ్యలు, చేపలతో పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇచ్చాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో పచ్చళ్ల స్టాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇందుకు అవసరమైన రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

– వీరాంజనేయులు, మత్స్యవిభాగం శాస్త్రవేత్త, కృషివిజ్ఞాన కేంద్రం, పందిరిమామిడి





సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- బాధిత కుటుంబానికి పరామర్శ



వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కుంభా రవిబాబు

పెదబయలు: మండలంలోని గుండె పోటుతో మృతి చెందిన పెదకోడాపల్లి సర్పంచ్ సెగ్గె వెంకటరమణ కుటుంబాన్ని శుక్రవారం బంగారుపుట్టులో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.కుంభా రవిబాబు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, సర్పంచ్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం కలిగిన వెంకటరమణ మృతి చెందడం ఎంతో బాధించిందన్నారు. నలుగురి పిల్లల పోషణ ఇబ్బందిగా ఉన్నందున వారి భవిష్యత్తు గురించి, ప్రభుత్వం సహకారం అందేలా కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో మాట్లాడతానన్నారు.

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు సంపరంగి లిల్లీ, సురేష్‌కుమార్, ఎంపీపీ వరహాలమ్మ, మాజీ ఎంపీటీసీ చంద్రుబాబు, సర్పంచ్‌లు వెంకటరావు, లక్ష్మీపతి, చిట్టిబాబు, మాజీ సర్పంచ్‌లు కమలాకర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.





ప్రజల చెంతకే పాలన

• అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అరకు సంతబయలులో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రజల చెంతకే పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. కించుమండ పంచాయతీ కుసుమగుడ, కొసోంగుడ, కంబవలస, కంగరుమామిడి గ్రామాల్లో శుక్రవారం గడప గడప కార్యక్రమంలో 112 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని, గ్రామ సందర్శన చేసి సమస్యలు తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.

స్కూటీపై ఎంపీ మాధవి...

గడప గడప కార్యక్రమానికి వెళ్లేందుకు కుసుమగుడ గ్రామానికి కారు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ఎంపీ మాధవి స్కూటీపై సెక్యూరిటీ లేకుండా వెళ్లారు. తాగునీటి ట్యాంక్ కోసం గ్రామస్తులు విన్నవించగా, తక్షణమే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పిలిచి ట్యాంకు నిర్మాణానికి అంచనా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొసోంగుడ గ్రామంలో మోటార్ మరమ్మతు కోసం స్థానికులు విన్నవించగా మూడు రోజుల్లో బాగు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, ఎంపీటీసీ సభ్యులు విజయ, వరహాలమ్మ, సర్పంచ్‌లు చెల్లమ్మ, నాగేశ్వరరావు, హరి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మహిళా అధ్యక్షురాలు శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, నాయకులు కృష్ణారావు, సింహాచలం, చిరంజీవి, సునీల్, నర్సింగ్, మల్లేష్, బాబూరావు, ఎంపీడీవో నగేష్, సీడీపీవో నీలిమ, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



కొయ్యూరులో చిత్తడి రహదారి మీదుగా వెళ్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ప్రజా సమస్య పరిష్కారానికే తొలి ప్రాధాన్యమిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. కొయ్యూరులో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో 397 గడపలను సందర్శించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కొయ్యూరు పర్యటలో చిత్తడిగా ఉన్న వీధిలో ప్రయాణించారు. రోడ్డుపై ఇలా మురుగునీరు పారితే రోగాలు ప్రబలే అవకాశాలుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులను ఆమె పిలిచి డ్రైనేజీ నిర్మాణానికి అంచనా వేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు మంజూరవుతున్నట్టు చెప్పారు. కొయ్యూరు కాలనీలో హైటెన్షన్ స్తంభాలు అడ్డంగా ఉండడంతో గృహాల నిర్మాణాలు ఇబ్బందులు ఉన్నాయని పలువురు మహిళలు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆమె కొయ్యూరు సబ్ ఇంజినీర్ శ్రీనివాస్‌కు స్తంభాలను తొలగించాలని ఆదేశాలిచ్చారు. మురుగుకాలువను పరిశీలించిన జెడ్పీటీసీ వారా నూకరాజు సమస్య పరిష్కారానికి జెడ్పీ నిధులు ఇస్తామన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు త్వరలో మంజూరుకానున్నట్టు చెప్పారు. ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, మహిళా విభాగ అధ్యక్షురాలు రాజులమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, ఎంపీటీసీ మల్లికార్జున్, బూత్ కమిటీ కన్వీనర్ పోతురాజు, నాయకులు సత్యనారాయణ, గంగాధర్, సావిత్రి, సుధాకర్, నరసింహం, ఎంపీడీవో మేరీ రోజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

అనంతగిరి: కాశీపట్నం గ్రామంలోని హోలీస్పిరిట్ ఆధ్వర్యంలోని గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. రైతు సాధికారత ప్రతినిధి సన్యాసినాయుడు మాట్లాడుతూ సేంద్రియ సాగుతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. సంస్థ సభ్యురాలు లూసి, వెలుగు సీసీ దేముడు, రాజు, శంకర్, సూర్యానారయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గంగవరం: గంగవరం, పెదగార్లపాడు, మొల్లేరు, వడ్డిచెరువు, ఆర్డీపురం గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం పర్యటించనున్నారు. స్థానిక ప్రభుత్వ కాలేజీలో నాడు–నేడు పనులకు శంకుస్థాపన, పెద్దగార్లపాడులో ఎరువుల పంపిణీ, మొల్లేరు, ఆర్డీ పురం, వడ్డి చెరువు గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ మండల ఇన్‌చార్జి రఘునాథ్ చెప్పారు. పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎటపాక: రాయనపేట పరిధిలోని పాతకొండెపల్లి, పెనుబల్లి, మంగువాయి, తాటాకులగూడెం గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. సోమవారం ఉదయం గన్నవరం, నెల్లిపాక ప్రాంతాల్లో జరగనున్న పలు కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కూనవరం : ఇటీవల సంభవించిన గోదావరి వరదలకు సర్వం కోల్పోయిన నిర్వాసితులైన 650 కుటుంబాలకు అమ్మ చారిటబుల్ ట్రస్టు దుస్తులు, ఇతర సామగ్రి అందుబాటులో తెచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బాధిత ప్రజలకు దుప్పట్లు, టవళ్లు, లుంగీలు, ప్లేట్లు, గ్లాసులు తదితర సామగ్రిని ట్రస్టు నిర్వాహకులు రామ్మోహనరావు, రాజాలు అందజేశారు. గౌరి, నాగేంద్ర, నర్సింహరావు, బుజ్జిబాబు, రామయ్య, ఫణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెదబయలు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మినీ గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రావిబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గోమంగి, అంజలి శనివారం మినీ గురుకుల పాఠశాలల్లో 22 ఏళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, వేతనం పెంచాలని వారు కోరారు.దీంతో సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రవిబాబు చెప్పారు. ఉపాధ్యాయులు విఘ్నేశ్వరి, చెల్లిమమ్మ తదితరులున్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి సమస్యలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రానికి వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును సర్పంచ్‌లు సుభాషచంద్ర, ఫుల్‌మొత్తి, పోర్తి, ఎంపీటీసీ బంగారమ్మ, నాయకులు సుభాష్, నానిబాబు, అర్జున్ తదితరులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రోడ్లు, తాగునీటి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన దపదఫాలుగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ



మంగ్లన్నదొరను పరామర్శిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు

సాక్షి,పాడేరు : అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మంగ్లన్నదొరను ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, సర్పంచులు రాంబాబు, సన్నిబాబు, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణపాత్రుడు, నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ కన్నాపాత్రుడు, తదితరులున్నారు.

గ్రామసభలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి : పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో ఉమామహేష్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి అన్ని పంచాయతీ కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు. ఈవోపీఆర్డీ పాపారావు, ఏపీవో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో 108 పైలెట్ మృతి



నూకరాజు(ఫైల్)

పాడేరు(రూరల్): పాడేరులో 108లో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్న నూకరాజు గురువారం రాత్రి నిద్రలో గుండె పోటు రావడంతో 108లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించామని, అప్పటికే నూకరాజు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబసభ్యులు తెలిపారు. సహచర సిబ్బంది ఇబ్రహీం, జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు, 108 యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: కోసంగుడ గ్రామంలో ఉపాధి నిధుల ద్వారా చేపడుతున్న రోడ్డు పనులకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతతో పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీవో దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణాకి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ హరి

కంద్రుంలో...

కంద్రుం పంచాయతీ కేంద్రంలో సీసీ రోడ్డు పనులను వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు హరి శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమతి, ముదుకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చే పనులు చేపడుతున్న జీసీసీ బ్రాంచి మేనేజర్ కృపానందం, సిబ్బంది

గూడెంకొత్తవీధి : గూడెంకాలనీ వద్ద భారీ వర్షాలకు కల్వర్టు పాడై ప్రమాదభరితంగా తయారైంది. దీంతో జీసీసీ బ్రాంచి మేనేజర్ కృపానందం సిబ్బందితో శ్రమదానం చేపట్టి కల్వర్టు వద్ద ఏర్పడిన గోతులను పూడ్చే పనులు చేపట్టారు. పాడైన కల్వర్టు ప్రాంతంలోని గోతులను పరిశీలించి, ఆయన శుక్రవారం ఉదయం పరిశీలించి, స్థానికుల సాయంతో గోతుల పూడ్చివేత పనులు చేపట్టారు. దీంతో జీసీసీ మేనేజర్‌కు స్థానికులు, వాహనచోదకులు కృతజ్ఞతలు తెలిపారు. సేల్స్‌మెన్ నారాయణ, జీసీసీ బంక్ గన్‌మెన్ రామచంద్రరావు, సిబ్బంది భాస్కర్ తదితరులున్నారు

మార్గదర్శకాలు అనుసరించి కులధ్రువీకరణ పత్రాలు



ఎమ్మెల్యే ధనలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నేతలు

అడ్డతీగల: ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని ఎల్లవరంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు వాల్మీకి సంఘం మండల ప్రతినిధులు రమేష్‌బాబు, ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కులధ్రువీకరణ పత్రాల మంజూరులో అన్ని కులాలకు ఒకే ప్రామాణికాలు పాటించాలని కోరారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించే సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

ఈ మేరకు పూర్వపు ఆధారాలు ఉన్న వాల్మీకి కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరును నిలిపివేయవద్దని తహసీల్దార్ శ్రీనివాసరావుని ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించినట్టు వారు తెలిపారు.

వై.రామవరం: వాల్మీకి కులస్తులపై ఆరోపణలు చేస్తున్న వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోట పంజాయతీ సర్పంచ్ చిన్నిబాబు ఆధ్వర్యంలో వాల్మీకి సంఘ ప్రతినిధులు అడిషనల్ ఎస్ఐ రాంబాబుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వాల్మీకులపై నిరాధారమైన ఫిర్యాదు చేశారని ఆరోపించారు. ఆయా సంఘాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ , ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు

గంగవరం: జడేరు ఎంపీపీ పాఠశాల, నీలవరం, నూగుమామిడి గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో నాడు-నేడు పనులకు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం శుక్రవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలలకు మహర్దశ చేకూరుతోందన్నారు. సర్పంచ్‌లు తమ్మన్నదొర, మల్లిఖార్జునదొర, అక్కమ్మ, మోహనాపురం, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్‌లు వీరబాబు, మోహన్, పార్టీ మండల ఇన్‌చార్జి రఘునాథ్, నాయకులు బాబి, శివ, రామకృష్ణ, హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

రాజవొమ్మంగి/గూడెం కొత్తవీధి: రాజవొమ్మంగి, గూడెం కొత్తవీధి తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శుక్రవారం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెల్ సిగ్నల్ వ్యవస్థ స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న మాతోట సంస్థ ప్రతినిధులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో మాతోట ట్రైబర్ ఫార్మింగ్- మార్కెటింగ్ సంస్థ సమావేశం శుక్రవారం జరిగింది. మాతోట చైర్ పర్సన్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు కల్పించి, రైతుల ఆర్థికాభివృద్ధే సంస్థ ధ్యేయమన్నారు. వ్యవసాయ సామగ్రిని రైతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది జరిగిన వ్యాపార లావాదేవీలను వివరించారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్ రామారావు, సీఈవో చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఇత్తడి కుందెల బహూకరణ



అమ్మవారికి దీపం కుందెలు బహుకరిస్తున్న భక్తుడు వరప్రసాద్

గంగవరం: స్థానిక శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి ఇత్తడి కుందెలను భక్తుడు దాడి వరప్రసాద్ దంపతులు శుక్రవారం అందజేశారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దసరా ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని దుర్గమ్మ తల్లి అలయ ప్రాంగణంలోని మండపంలో ఏర్పాటుచేసిన దుర్గమ్మ విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సుభాష్‌చంద్ర, ప్రసాద్ రావు, బలరాం, భాస్కరరావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

379 పశువులకు టీకాలు

హుకుంపేట: తీగలవలస పంచాయతీ రాతుల పుట్టు, కామయ్యపేట, బాసలబంద, తోకదుర్గం తదితర గ్రామాల్లో సుమారు 379 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ చెప్పారు. లంపీ, తదితరు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేశామని, పశు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గోన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: పెదలువ్వాసింగి అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న పోషకాహార మాసోత్సవాలను ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సర్పంచ్ రాంబాబు, సీడీపీవో సువర్ణమ్మ, విజయలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, అన్నపూర్ణ, సత్యసుజాత, పద్మావతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, ఏఎంసీ ట్రేడర్ బాబూరావు, నాయకులు కొండబాబు, సూర్యప్రకాష్‌నాయుడు, అబ్బాయినాయుడు తదితరులున్నారు.

ఎటపాక: గౌరిదేవీపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ శివ కనకరాజు శుక్రవారం సందర్శించారు. పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.రాణి, ఆదిలక్ష్మి, అచ్చిమాంబ, నాగమణి, పద్మ తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ సంఘాల అధ్యక్షుడిగా సత్యారావు

అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(98 పీఏసీఎస్‌లు) అధ్యక్షుడిగా శానాపతి సత్యారావు (లక్ష్మీపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక డీసీఎంఎస్ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా మళ్ల కొండబాబు (కొక్కిరాపల్లి), ఉపాధ్యక్షులుగా కోనపల్లి రామ్మోహనరావు (మునగపాక), పి.డి.గాంధీ(తుమ్మపాల), సహాయ కార్యదర్శిగా శెట్టి వెంకటరావు (రోలుగుంట), కోశాధికారిగా సాయిరామ్ రమేష్ (బంగారుమెట్ట), కమిటీ డైరెక్టర్లుగా మరో 15 మందిని ఎన్నుకున్నారు. శాశ్వత చైర్మన్లుగా డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి వ్యవహరిస్తారని నూతన కమిటీ అధ్యక్షుడు సత్యారావు తెలిపారు. సంఘం అభివృద్ధితోపాటు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు నూతన కమిటీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: తామరపల్లి ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించిన మినుము విత్తనాలను ఎంపీటీసీ సభ్యుడు వంశీ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సలహా కమిటీ చైర్మన్ అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న పూజారమ్మలు

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రానికి అనుబంధంగా హైందవ ధర్మ పరిరక్షణకు విశేష సేవలందిస్తున్న పూజారమ్మలను రాజమహేంద్రవరంలోని సదానంద సరస్వతి స్వామీజీ ఆశ్రమంలో శుక్రవారం సత్కరించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులువెంకటరామయ్య, విజయలక్ష్మి మాట్లాడుతూ పూజారమ్మలు అందిస్తున్న సేవలను కొనియాడారు. యర్లగడ్డ, చింతకర్రపాలెం, వెలమలకోట, రేగులపాడు గ్రామాలకు చెందిన పూజారమ్మలను వస్త్రాలు సమర్పించారన్నారు.

రహదారుల కోసం వినతి



డ్వామా పీడీ రమేష్‌రామ్‌నుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ సత్యవతి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయాన్ని శుక్రవారం పరిశీలించిన డ్వామా పీడీ రమేషరామ్‌ను సర్పంచ్ సత్యవతి కలిసి లబ్బర్తి గ్రామంలో రోడ్లు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం పీడీను కోరారు. పంచాయతీ ఇన్‌చార్జ్ అంజిబాబు, ఎంపీడీఓ బాపన్నదొర పాల్గొన్నారు.

నేడు లగిసిపల్లిలో 'గడప గడపకు'

సాక్షి,పాడేరు : లగిసిపల్లిలోని సంపంగి గరువు, ఊగం గొయ్యి గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ రమేష్

జి.మాడుగుల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ రమేష్ శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ రాంబాబు తదితరులున్నారు.

నేడు ఎంపీపీగా అనూషదేవి ప్రమాణ స్వీకారం



అనూషదేవి

చింతపల్లి రూరల్: తాజంగి ఎంపీటీసీ సభ్యురాలు కోరాబు అనూషదేవి(వైఎస్సార్‌సీపీ) శనివారం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ప్రస్తుత ఎంపీపీ బాబూరావుపై కోర్టులో అభియోగాలు నమోదవడంతో ఉమ్మడి విశాఖ జిల్లా అథారిటీ పదవీ నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ అయినట్టు చెప్పారు. ఈ మేరకు అనూషదేవికి అవకాశం దక్కింది. కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు బాబూరావుకు అందజేసేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరని, అతని కార్యాలయనికి కోర్టు నోటీసులు అతికించినట్టు ఎంపీడీవో తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన తగదు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం జరిగిన నాడు నేడు పనుల శంకుస్థాపనకు ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ తనకు సమాచారం ఇవ్వకుంటా కార్యక్రమం నిర్వహించడంపై వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ పంచాయతీలో ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత ఉందని, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం అధికారులకు తగదని, కచ్చితంగా సమాచారం అందించాలని ,లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



జడ్డంగిలో పరిసరాలు పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్

రాజవొమ్మంగి: జడ్డంగి గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ శుక్రవారం పర్యటించారు. వీధుల్లో తిరిగి పరిసరాల పరిశుభ్రత, దోమ తెరల వినియోగం తదితర విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

అనంతగిరి: టోకూరు పంచాయతీ ములియగుడలో తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి చోరీ చేసి, అందులోని రాగి తీగలను తీసుకెళ్లినట్టు కార్యదర్శి లక్ష్మీ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం పింపుడువలసలో కూడా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగినట్టు సర్పంచ్ మోస్య చెప్పారు. పోలీసుల దర్యాప్తు చేసి, చోరీకి పాల్పడతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.